www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 14 జూన్ 2025

5

ఏలూరు

కొనసాగిన డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ నియామక పరీక్షలు (మెగా డిఎస్‌సి-2025) శుక్రవారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 200 మందికి 194 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 171 మంది హాజరవ్వగా, తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. మొత్తం 380 మందికి 365 మంది హాజరవ్వగా 15 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు సి ఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 200 మందికి 196 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 177 మంది హాజరవ్వగా ముగ్గురు గైర్హాజరయ్యారు. మొత్తం 380 మందికి 373 మంది హాజరవ్వగా, ఏడుగురు గైర్హాజరయ్యారు.

'పిజిఆర్‌ఎస్' ఫిర్యాదులపై..

చర్యలేవీ..!

తప్పుడు ఎండార్స్‌మెంట్లతో ఫిర్యాదుల మూసివేత

సమాచార హక్కు చట్టంలో అడిగినా సమాధానం ఇవ్వని దుస్థితి

ఫిర్యాదుపై సంతృప్తి చెందక రీఓపెన్ చేస్తే కింది అధికారుల నివేదికలతో డివిజన్ అధికారి మళ్లీ మూత

విసిగిపోతున్న జనం.. నెలలు, సంవత్సరాలపాటు తిరగాల్సిన పరిస్థితి

డివిజన్, మండల కేంద్రాల్లో నామకహాగా పిజిఆర్‌ఎస్

'నిడమర్రు మండలంలోని తిమ్మారావుగూడెం భూముల్లో ప్రభుత్వ భూమిని కలిపేసుకుని చేపల చెరువు తవ్వకాలు సాగించారని, దానిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు బాధితుడు పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. చేపల చెరువుల రైతులకు చెరువు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చామని, రైతులు రాతపూర్వక వాంగ్మూలం ఇచ్చారని, ఆర్‌ఐ, విఆర్‌ఒ ఇచ్చిన నివేదికల ఆధారంగా ఇది జరిగిందంటూ పిజిఆర్‌ఎస్ ఫిర్యాదు మూసివేస్తున్నట్లు తెలిపారు. సదరు నివేదికలు, రైతుల వాంగ్మూలాల ప్రతులు ఇవ్వాలంటూ తహశీల్దార్ కార్యాలయానికి సమాచార హక్కుచట్టం దరఖాస్తు చేయగా సమాధానం లేకుండాపోయింది. దీంతో ఆర్‌డిఒ కార్యాయానికి అప్పీల్ చేయడంతో వారం రోజుల్లో సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. వాస్తవానికి తప్పుడు ఎండార్స్‌మెంట్ ఇస్తూ ఫిర్యాదును మూసివేసినట్లు తెలుస్తోంది.'

'చేపల చెరువుకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ సబ్సిడీ దుర్వినియోగమవుతుందని నిడమర్రు మండలంలోని విద్యుత్ శాఖ అధికారులకు పిజిఆర్‌ఎస్‌లో ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. తహశీల్దార్, ఎఫ్‌డిఒ, సంబంధిత వ్యక్తికి నోటీసులు జారీ చేసినట్లు తెలుపుతూ, ఆ కాపీలను అప్‌లోడ్ చేసి మండలాధికారులు ఫిర్యాదు మూసివేశారు. ఉంగుటూరులో ఉన్న విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డిఇఇ) అధికారికి ఫిర్యాదు రీఓపెన్ చేశారు. ఆయన సమస్యను పూర్తిగా పరిష్కరించకుండా మళ్లీ మండలాధికారులు ఇచ్చిన నివేదికలనే ఇచ్చి పిజిఆర్‌ఎస్ ఫిర్యాదును మూసివేశారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న ఫిర్యాదులే కాదు. పిజిఆర్‌ఎస్ ఫిర్యాదుల పరిష్కారం అత్యధికంగా ఇదేవిధంగా సాగుతోంది. పిజిఆర్‌ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) ఫిర్యాదులను అధికారులు తూతూమంత్రంగా మార్చేశారు. తమ సమస్య పరిష్కారం కోసం జనం ఇస్తున్న ఫిర్యాదులను మండల, డివిజన్ అధికారులు సరిగ్గా పట్టించుకోని పరిస్థితి ఉంది. గడువు చివరిరోజు వరకూ వేచిచూసి సమస్యను పరిష్కరించకుండానే ఏదోక కారణం చూపి మూసివేస్తున్నారు. మండలాధికారుల వద్ద సమస్య పరిష్కారం కాలేదని, డివిజన్‌స్థాయి అధికారులకు రీఓపెన్ చేస్తే మండలాధికారుల ఇచ్చిన నివేదికలనే మళ్లీ జతచేసి మూసివేస్తున్నారు. ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పిజిఆర్‌ఎస్‌ను నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా అధికారులు, ప్రభుత్వం సైతం చెబుతోంది. జిల్లాలో ప్రతి సోమవారం దాదాపు 200 వరకూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తుంటాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ముందుగా సంబంధిత శాఖ మండలాధికారులకు ఇస్తున్నారు. మండలాధికారుల చుట్టూ తిరిగితిరిగి జిల్లా కేంద్రానికి వస్తే మళ్లీ తిరిగి అక్కడికే తమ ఫిర్యాదును పంపుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఫిర్యాదును బట్టి నెల రోజుల నుంచి వంద రోజుల వరకూ గడువు విధిస్తున్నారు. రోజులన్నీ గడిచిన తర్వాత చివరిరోజు ఏదోకటి రాసేసి మండలాధికారులు ఫిర్యాదులు మూసివేస్తున్నారు. తర్వాత మళ్లీ ఫిర్యాదు చేసుకోవడం ఆనవాయితీగా మారిపోయింది. కొంతమంది అధికారులు తప్పుడు ఎండార్స్‌మెంటులు (సమాధానాలు) సైతం పేర్కొంటూ ఫిర్యాదులను మూసివేస్తున్న పరిస్థితి ఉంది. ఫిర్యాదుదారులకు అనుమానం వచ్చి ఫిర్యాదు మూసివేసిన నివేదికలను సమాచార హక్కుచట్టంలో అడిగితే ఇవ్వడం లేదు. పిజిఆర్‌ఎస్ ఫిర్యాదులపై ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఒకటి, రెండుసార్లు తిరిగి అలసిపోయి చాలామంది పిజిఆర్‌ఎస్‌కు రావడానికి సైతం ఇష్టపడటం లేదు. జిల్లా ఉన్నతాధికారులు పిజిఆర్‌ఎస్ ఫిర్యాదుల మూసివేతల్లో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు. తప్పుడు ఎండార్స్‌మెంట్లు ఇస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటేనే ప్రజలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

నామకహాగా మండల, డివిజన్లలో పిజిఆర్‌ఎస్‌లు

ప్రతి సోమవారం మండల, డివిజన్ కేంద్రాల్లో పిజిఆర్‌ఎస్ ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందని జిల్లా అధికారులు పత్రికా ప్రకటనలు ఇస్తూనే ఉంటారు. వాస్తవానికి మండల, డివిజన్ కేంద్రాల్లో సక్రమంగా పిజిఆర్‌ఎస్ ఫిర్యాదుల కార్యక్రమం జరగడం లేదు. కొన్ని డివిజన్ కేంద్రాల్లో జరిగిన ఆర్‌డిఒలు ఉండటం లేదు. ఎఒలు, కిందిస్థాయి అధికారులు ఫిర్యాదులు తీసుకుంటున్నారు. గట్టిగా పట్టుబడితే తప్ప ఆన్‌లైన్ కూడా చేయడం లేదు. ఫిర్యాదు ఇచ్చిన జిరాక్స్‌పై స్టాంప్ వేసి పంపిస్తున్నారు. జిల్లా కేంద్రం ఏలూరు డివిజన్‌లో సోమవారం సైతం ఫిర్యాదులు తీసుకోవడం లేదు. జిల్లాస్థాయిలో పిజిఆర్‌ఎస్ జరుగుతుంది కదా అని చెబుతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే ఆన్‌లైన్ చేయకుండా తీసుకుంటున్నారు. మండలస్థాయిలో పరిస్థితులు మరింత ఘోరంగా ఉన్నాయి. పిజిఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేవిధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మెరుగైన సాయమందించాలి

బాల్య వివాహాలు నివారించాలి: కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

బాధిత మహిళల సహాయం కోసం ఏర్పాటు చేసిన వన్‌స్టాప్ సెంటర్‌కు సహాయం కోసం వచ్చిన మహిళలకు మెరుగైన సహాయం అందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో శుక్రవారం వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలు, బాలలకు అందుతున్న సహాయ కార్యక్రమాలపై కలెక్టర్ అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు తదితర బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించి, వారి సమస్య పరిష్కారమయ్యేంత వరకు సహాయం అందించడం వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది బాధ్యతని అన్నారు. బాధిత మహిళలు, పిల్లలకు వారి సమస్యలను గుర్తించి, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, అవసరమైతే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి వారికి సత్వర న్యాయం అందించే దిశగా వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది కృషి చేయాలన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు సమస్య బాధితులు టోల్‌ఫ్రీ 112 నెంబర్‌కుగాని, 9550351100, 9491195221 నెంబర్లకుగానీ ఫోన్ చేసి సహాయం పొందవచ్చని, బాధితులకు ఉపయోగపడేలా ఈ ఫోన్ నెంబర్లను అన్ని ప్రధాన కూడళ్లలో ప్రదర్శించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, తొమ్మిదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థినీ పదో తరగతిలో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా మహిళలు కుటుంబ తగాదాలతో ఇంటినుండి బయటకు వచ్చినా, ఇంటి సమస్యల కారణంగా పారిపోయి వచ్చిన బాలలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని ఇంటికి పంపాలన్నారు. ఎటువంటి ఆధారమూ లేని మహిళలు, పిల్లలను పునరావాస గృహాలకు తరలించాలన్నారు. బాధిత మహిళలు వారి కాళ్లపై వారు నిలబడేలా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఐసిడిఎస్ పీడీ శారద, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సిహెచ్.నిర్మల, ఎల్‌డిఎం నీలాద్రి పాల్గొన్నారు.

14న యోగాంధ్ర మాక్ డెమో

ప్రజల్లో యోగా ప్రాముఖ్యతను పెంపొందించే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఈనెల 14న యోగాంధ్ర మాక్ డెమో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో 6,197 వేదికల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేయాలని మండలస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంతవరకు యోగా ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొనేందుకు 8,46,428 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు

జెడ్‌పి సిఇఒగా శ్రీహరి బాధ్యతల స్వీకరణ



జెడ్‌పి సిఇఒకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సిఇఒగా ఎం.శ్రీహరి నియమితులయ్యారు. నెల్లూరు జిల్లాలో ఎంపిడిఒగా పని చేస్తూ డిఎల్‌డిఒగా ఉద్యోగోన్నతి పొంది జిల్లాకు సిఇఒగా నియమితులయ్యారు. కొంతకాలంగా జెడ్‌పికి రెగ్యులర్ సిఇఒ లేరు. డిప్యూటీ సిఇఒ కె.భీమేశ్వర రావు ఇన్‌ఛార్జి బాధ్యతలు చూస్తున్నారు.. బదిలీల్లో భాగంగా ఇప్పుడు పూర్తిస్థాయి సిఇఒ నియమితులయ్యారు. సిఇఒగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన శ్రీహరి మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కలిశారు. బాధ్యతలు స్వీకరించిన జెడ్‌పి సిఇఒకు కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిఇఒ శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

మండల కేంద్రాల్లో ధర్నాలు

బుట్టాయగూడెం : ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అంగన్వాడీల పిల్లలకు తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రేషన్ కార్డులివ్వాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి తహశీల్దార్ చలపతిరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షురాలు పుష్ప, అంగన్‌వాడీ నేత రామలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్యని అన్నారు. కార్యక్రమంలో వెంకాయమ్మ, లలిత, మారమ్మ, భూదేవి, సీత పాల్గొన్నారు.

ముసునూరు: అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.రాజకుమారి మాట్లాడగా, విద్యావతి, మేరీ సులోచన, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ ఈ నెల 16న జిల్లా కలెక్టరేట్ల వద్ద అంగన్వాడీల ధర్నాలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, ప్రసన్న, మణి, పాల్గొన్నారు.

పది గంటల పనిని వ్యతిరేకిస్తూ ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చిన్నగాంధీ బొమ్మ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సిఐటియు నేతలు

రాష్ట్ర ప్రభుత్వం పది గంటల పని విధానాన్ని తీసుకురావడాన్ని నిరసిస్తూ పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర కూటమి పాలకులు మద్దతు పలకటం దారుణమన్నారు. పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, నాయకులు రంగారావు, ప్రసాద్, రామారావు, ఆదిలక్ష్మి, జయలక్ష్మి, సంసోను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో భారీ వర్షం

ముంపుబారిన వరి చేలు - ఆందోళనలో రైతులు

చెరువులను తలపిస్తున్న విత్తనాలు వెదజల్లిన వరిచేలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లి పరిసర గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు మూడు గంటలపాటు కురిసిన భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారులు జలమయ్యాయి. వర్షంతో ముదినేపల్లి సెంటర్ అధ్వానంగా తయారైంది .రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు నానావస్థలు పడ్డారు. పలు కాలనీల్లో మోకాల్లోతు నీరు చేరడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. మండలంలో సార్వా సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం రైతులు పొలాలను సిద్ధం చేసి విత్తనాలను వెదజల్లుతున్నారు. ఈ తరుణంలో భారీ వర్షంతో పొలాలన్నీ నీట మునిగాయి. పొలాలన్నీ చెరువులను తలపించే రీతిలో మారాయి. ఈ నెల 11న కురిసిన భారీ వర్షంతో నీట మునిగిన విత్తనాలు వెదజల్లిన పొలాల్లో ఇంక వర్షపు నీరు తగ్గలేదు. ఈ తరుణంలో మళ్లీ భారీ వర్షం కురవడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. ముంపునకు గురైన విత్తనాలు వెదజల్లిన చేల నుండి నీటిని బయటికి మళ్లించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మొన్న కురిసిన వర్షంతో విత్తనాలు చల్లిన పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. చేలల్లో ముంపు ఇంకా తగ్గక ముందే మళ్లీ వర్షం కురవడంతో రైతన్న కష్టాలు అధికమయ్యాయి. భారీ వర్షాలకు డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు బయటికి పోయే అవకాశం లేకపోవడంతో రైతులు అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చేల నుంచి ముంపు నీరు బయటికి వెళ్లని పక్షంలో విత్తనాలు నీటిలో నాని కుళ్లిపోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి అంతా నీటి పాలయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు మెరుగుపర్చాలి: సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో ప్రభుత్వాసుపత్రుల్లో వసతులు, సేవలు మెరుగుపరచాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నాణ్యమైన మందులు ఉచితంగా సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)లో వైద్య సేవలు రోజురోజుకీ దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు లెక్కలేకుండా పోతుందని పేర్కొన్నారు. ఇటీవల గర్భిణికి కాల పరిమితి దాటిన మందులను ఇవ్వడమే దీనికి నిదర్శనమని తెలిపారు. ఈ పరిస్థితికి పూర్తిస్థాయిలో సూపరింటెండెంట్ పోస్ట్‌ను భర్తీ చేయకపోవడం, వైద్యులు, సిబ్బంది అలసత్వంగా వ్యవహరించడం కారణమని పేర్కొన్నారు. తక్షణం పరిస్థితులను చక్కదిద్దాలని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు, నిరుపేదలు

మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్ పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఎఎస్ఆర్ నగర్ నిరుపేదలకు ఇంటి ఎంజాయ్‌మెంట్లు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసి, వ్యక్తిగతంగా దరఖాస్తులు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా గ్రామంలో నివాసముంటున్న పేదలకు సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. అనేకసార్లు ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసినా పేదల అర్జీలను అధికారులు బుట్ట దాఖలు చేస్తున్నారే తప్ప పేదలకు న్యాయం చేసింది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను రెగ్యులర్ చేయాలనే జిఒ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, సభ్యులు మడకం కుమారి, శిరీష, అనుమోలు మురళీ, పెట్ల మంగ, బరగడ కుమారి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలానికి మరో ఆర్‌టిసి బస్సు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఆర్‌టిసి బస్సును ప్రారంభిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

భీమవరం నుండి భద్రాచలం కొత్త ఆర్‌టిసి బస్సు సర్వీసును విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పల నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక కొత్త బస్సులు కొత్త రూట్లలో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. భద్రాచలం రాముని దర్శనానికి భీమవరం డిపో నుండి గతంలో ఒక బస్సు ఉందని, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ ఆదేశాల మేరకు మరో బస్సుని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర ప్రాంతాలకు మరిన్ని బస్సులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. భీమవరం డిపో మేనేజర్ పిఎస్‌వి ఎం.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఇప్పటికే నడుస్తున్న భద్రాచలం సర్వీస్ బాగా విజయవంతమైందని, కొత్త సర్వీసు భీమవరంలో రాత్రి 8 గంటలకు బయలుదేరి ఏలూరు 10 గంటలకు వస్తుందని, భద్రాచలం తెల్లవారు జామున మూడు గంటలకు చేరుతుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ఉదయం 8 గంటలకు భద్రాచలంలో బయలుదేరి ఒంటి గంటకు ఏలూరు చేరుకుంటుందని, మూడు గంటలకు భీమవరం చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, ఎఎంటి జి.మురళి, పిఆర్‌ఒ నరసింహం, కార్మికులు పాల్గొన్నారు.

ఏలూరులో వేగ జ్యువెలర్స్ ప్రారంభం

పాల్గొన్న సినీనటులు బాలకృష్ణ, సంయుక్త మీనన్

బంగారు నగలను చూపిస్తున్న హీరో బాలకృష్ణ, హీరోయిన్ సంయుక్తమీనన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విశ్వసనీయతకు మరోపేరుగా నిలిచిన వేగ జ్యువెలర్స్ అంటే తరుగులేని నమ్మకమని సినీ హీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. ఏలూరులోని కొత్త బస్టాండ్ ఆవరణలో శుక్రవారం వేగ జ్యువెలర్స్ ఐదో నూతన షోరూం ప్రారంభోత్సవానికి బాలకృష్ణతోపాటు హీరోయిన్ సంయుక్త మీనన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అభిమానులు వేలాదిగా పాల్గొన్నారు. బాలకృష్ణ, సంయుక్త మీనన్ తొలుత రిబ్బన్ కట్ చేసి షోరూమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ బంగారానికి వన్నె తెచ్చేది ఆడవాళ్లని, ఆడవాళ్లకు వన్నె తెచ్చేది బంగారం అని అన్నారు. వేగ జ్యువెలర్స్ వారు తక్కువ ధరకే బంగారం అందిస్తున్నారన్నారు. హీరోయిన్ సంయుక్త మీనన్ మాట్లాడుతూ వేగ జ్యువెలర్స్ వారు ప్రతి లక్ష రూపాయల కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం అందించడమే కాక పాత బంగారం మార్పిడిపైన ప్రతి గ్రాముకు వంద రూపాయలు అదనంగా చెల్లిస్తున్నారని తెలిపారు. అనంతరం ఛైర్మన్ బండ్లమూడి రామ్మోహన్ మాట్లాడుతూ వేగ జ్యువెలర్స్‌లో డైమండ్ ధర క్యారెట్ ఒక్కదానికి రూ.51,999 మాత్రమేనని తెలిపారు. ఏలూరు షోరూమ్ ప్రారంభం సందర్భంగా ఒక లక్కీ డ్రా నిర్వహించి ఐదుగురు లక్కీ డ్రా విజేతలకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల విలువైన డైమండ్ నెక్లెస్‌లను బహుమతిగా అందిస్తామన్నారు. ఈ ఆఫర్లన్నీ ఏలూరు షోరూమ్‌లో మాత్రమే వర్తిస్తాయని, జూన్ 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ వనమా నవీన్ కుమార్ మాట్లాడుతూ వేగ జ్యువెలర్స్ షోరూమ్‌లో సాంప్రదాయ నగల నుండి ఫ్యాషన్ నగలు వరకు అన్ని రకాల ఆభరణాలు ఖాతాదారుల అభిరుచి ప్రకారం అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వేగ జ్యువెలర్స్ డైరెక్టర్ వనమా సుధాకర్, చంద్రకాంత్, చిట్లూరు నాగేశ్వరరావు, ఎంఎల్‌ఎ బడేటి చంటి, ఆర్‌టిసి విజయవాడ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మాజీ ఎంఎల్‌ఎ అంబికా కృష్ణ పాల్గొన్నారు.

కోఆపరేటివ్ బ్యాంకులతోనే ఆర్థిక భరోసా

విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ పూర్వపు ఛైర్మన్ మానం ఆంజనేయులు

నూజివీడులో బ్రాంచి ప్రారంభం

కోఆపరేటివ్ బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి - నూజివీడుటౌన్

కోఆపరేటివ్ బ్యాంకులతో మాత్రమే పేదలకు ఆర్థిక భరోసా ఏర్పడుతుందని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ పూర్వపు ఛైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లోని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ 56వ శాఖను ప్రస్తుత ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అధ్యక్షతన శుక్రవారం సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మానం ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి ప్రజలు, రైతులకు కోఆపరేటివ్ బ్యాంకులు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ 110 సంవత్సరాల ప్రస్థానంలో ఏనాడు ప్రభుత్వాల వద్ద నుండి ఒక రూపాయి కూడా రుణం తీసుకోలేదన్నారు. మెరుగైన సమాజం కావాలంటే కోఆపరేటివ్ బ్యాంకులు పరిపుష్టి కావాలన్నారు. పాలకవర్గం తమ బాధ్యత సక్రమంగా నిర్వహించడం వల్ల విశాఖపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఇంతగా అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా మిల్క్ డెయిరీ అధ్యక్షులు చలసాని ఆంజనేయులు, గుత్తి కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు జిలానీ, తణుకు కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ వెంకటరత్నం, శారదాంబ మహిళా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్‌పర్సన్ కుసుమ లావణ్య, సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు రంగరాజు, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జెవివి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

జిఒ-36 ప్రకారం జీతాలు చెల్లించాలని వినతి

వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు జిఒ-36 ప్రకారం పెంచి అమలు చేయాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ తర్వాత నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఏలూరు నగర కమిటీ తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు శుక్రవారం యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వం కూడా ఆ అన్యాయాన్ని సరిదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ నెంబర్ 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500 చొప్పున జీతాలు పెంచి అమలు చేయాలన్నారు. పారిశుధ్య విభాగం కార్మికులకు రూ.21 వేలు ఇస్తూ ఇంజినీరింగ్ కార్మికులకు రూ.15 వేలు చెల్లించడం అన్యాయం అన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, లేకపోతే సమ్మె తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి ఎ.జానుబాబు, ఉపాధ్యక్షులు బంగారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నేటి సమాజంలో 63 శాతం వృద్ధులు నిరాదారణకు గురవుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఈ నెల 15వ తేదీ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక సీనియర్ సిటిజన్ అసోసియేషన్ హాలులో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడారు. నిరాదారణకు గురైన వృద్ధులకు ఎటువంటి న్యాయ సహాయం అవసరమైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను, మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రత్నరాజు, ఏలూరు వయోవృద్ధుల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్‌వివిఎస్.ప్రసాద్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

తపస్ విద్యాసంస్థ

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజలకు మెరుగైన సేవలందించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. పట్టణంలో నూతనంగా ఆధునికీకరించిన నగర పంచాయతీ కమిషనర్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సమస్యతో వచ్చే ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి టోనీ అభిషేక్‌కు అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ జెడ్‌పి హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థి టోనీ అభిషేక్ నేషనల్ మీన్స్ కామన్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డివిఎల్.పుష్పలత అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ అభిషేక్‌కు రానున్న ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందించనున్నట్లు వివరించారు.

ఉపాధి కల్పనే లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌తో ఉన్న స్నేహ సంబంధాలతో యుకె నుంచి వచ్చిన విదేశీ పెట్టుబడుదారులు, సిఎం చంద్రబాబు మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. రాష్ట్రంలో వివిధ రంగాల్లో రూ.రెండు వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పెట్టుబడిదారుల బృందం సుముఖత వ్యక్తం చేసిందని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా పదివేల మందికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న యోగా ముద్ర

ఏలూరు సిటీ :ఏలూరు సర్ సిఆర్.రెడ్డి కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల థీమ్ యోగాతో హేలాపురి నగరం పులకరించింది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ప్రదర్శించిన యోగాముద్ర ఆకృతి అందరిని ఆకట్టుకుంది. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెసి పి.ధాత్రిరెడ్డి, ఆర్‌టిసి విజయవాడ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఎంఎల్ఎలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, ఏలూరు, దెందులూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు మామిళ్లపల్లి పార్థసారథి, గారపాటి రామసీత, కార్పొరేషన్ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్.పెదబాబు విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్షా అభియాన్ ఎపిసి కె.పంకజ్‌కుమార్, ఆయూష్ డిడి లక్ష్మీసుభద్ర, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, నగరపాలక సంస్థ కమిషనరు ఎ.భానుప్రతాప్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్ఎస్.కృపావరం, సెట్ వెల్ సిఇఒ ప్రభాకర్, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆర్‌వి.నాగరాణి, పర్యాటక శాఖ మేనేజరు పట్టాభి, ఏలూరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఏలూరులో చోరీ

ఏలూరు స్పోర్ట్స్ :ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరులు నగదు, బంగారం అపహరించుకుపోయారు. ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని దక్షిణపు వీధికి చెందిన ఇన్నమూరి భాస్కరరావు ఇంటి వద్దనే కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబంతో కలిసి ఆదివారం పెద్ద తిరుపతి శ్రీవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి చేరుకుని చూసేసరికి ఇంటి తలుపు తాళాలు పగల గొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా 15 కాసుల బంగారం, రూ.మూడు లక్షల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ ఎస్ఐ మదీనా భాష ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితులు ఇంటికి వచ్చి ఇంటిని తనిఖీ చేస్తున్న సమయంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఆ ప్రాంతంలో పర్యటిస్తున్నారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల వద్ద నుంచి వివరాలు తెలుసుకున్నారు. కేసు విచారణ వేగవంతం చేయాలని పోలీసులకు ఆదేశించారు.

ఉప్పాడ బీచ్‌లో లక్ష్మీపురం యువకుడు మృతి

జీలుగుమిల్లి :కాకినాడ సమీపంలోని ఉప్పాడ తీరం వద్దకు సముద్ర స్నానానికి వెళ్లిన మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్.పార్థు(17) గురువారం మధ్యాహ్నం ఇద్దరు స్నేహితులతో కలిసి ఉప్పాడ తీరం వద్దకు సముద్ర స్నానానికి వెళ్లారు. సముద్ర స్నానం చేస్తుండగా పార్థు ప్రమాదవశాత్తూ లోయలో పడి గల్లంతైనట్లు స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం తీరం వెంబడి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అంబులెన్స్‌లో యువకుడి మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

జీలుగుమిల్లి : కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.సుబ్బారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాచన్నగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ, అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన టి.కళ్యాణ్ ఏడాది క్రితం హైదరాబాద్ ఆర్య సమాజంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల అదనపు కట్నం తీసుకురావాలని తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని మహిళ తన భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టడమే లక్ష్యం

తపస్ విద్యాసంస్థల ఛైర్మన్ దాకారపు కృష్ణ

తపస్ విద్యాసంస్థ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బట్టి పట్టే చదువులకు స్వస్తి చెప్పి విద్యార్థులు ఇష్టంగా విద్యభ్యసించి వారిని ఉన్నత స్థాయిలో నిలబెట్టాలనే లక్ష్యంతో తపస్ విద్యాసంస్థలను స్థాపించినట్లు ఛైర్మన్ దాకారపు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. తనతో పాటు మరో నలుగురు డైరెక్టర్లతో ఈ స్కూలు, జూనియర్ కాలేజీ స్థాపించి మొదటి వార్షికోత్సవం పూర్తి చేసుకున్నట్లు వివరించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఈ స్కూల్ స్థాపించామన్నారు. రోటరీ క్లబ్ ద్వారా ఎంతోమంది పేదలకు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. స్కూలు మొదటి వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా జెడి లక్ష్మీనారాయణ విచ్చేశారని, ఆయన స్కూల్ గొప్పతనం, సేవలను అందరికీ వివరించారని తెలిపారు. ర్యాంకులు వస్తేనే ఉద్యోగాలు వస్తాయని మాత్రమే కాకుండా సమాజంలో ఎలా బతకాలి.. ఎలా ఉండాలి.. అనేవి కూడా విద్యార్థులకు నేర్పిస్తామని చెప్పారు. విద్యను ఓ తపస్సుగా భావించి, ప్రతి విద్యార్థి భవిష్యత్తును నిర్మించడమే లక్ష్యంగా తపస్ విద్యాసంస్థలు స్థాపించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు విద్యాసంస్థ నిబద్ధతతో పని చేస్తుందన్నారు. స్కూల్ ప్రారంభించిన మొదటి సంవత్సరమే రికార్డు స్థాయిలో అడ్మిషన్లు వచ్చాయన్నారు. మొదటి సంవత్సరం స్కూల్ అడ్మిషన్లు 423 వచ్చాయని, జూనియర్ కాలేజీ అడ్మిషన్లు 140 వచ్చాయని తెలిపారు. ఇంత మంచి ఆదరణ ఇచ్చిన తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం తరపున కృతజ్ఞతలు తెలిపారు. మొదటి సంవత్సరమే తమ స్కూల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు నైతికతను నెలకొల్పి సమర్థవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఉత్తమ బోధన, ఆధునిక వసతుల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచడం తమ స్కూల్ ప్రాముఖ్యత అని చెప్పారు. తపస్ అంటే త్యాగం కాదని, లక్ష్యంపైన నిబద్ధత అని వివరించారు.

విద్యాసంస్థ ప్రత్యేకతలు

1. వంద శాతం ఉత్తీర్ణత, రికార్డు స్థాయిలో ర్యాంకుల సాధన
2. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక కోచింగ్
3. సాంకేతిక ఆధారిత బోధన, స్మార్ట్ తరగతులు, డిజిటల్ లైబ్రరీ, ఆన్‌లైన్ అసైన్‌మెంట్
4. సైన్స్, మ్యాథ్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు
5. పేరెంట్స్ కమ్యూనికేషన్
6. సహపాఠ్య కార్యక్రమాలు, క్రీడలు, సాంస్కృతిక వేడుకలు, పోటీలు

సత్యనారాయణను శుభాకాంక్షలు కూటమి నేతలు

జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎంగా సత్యనారాయణ

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

స్థానిక జెడ్‌పి హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను టిడిపి మండలాధ్యక్షులు అమరవరపు అశోక్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు శాలువాతో సత్కరించారు. నూతనంగా విధులు చేపట్టిన ఏడుగురు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లు, పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు.

విద్యార్థి మిత్ర కిట్లు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నడూ లేని విధంగా మొట్టమొదటిసారి పాఠశాల తెరిచిన రోజునే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లును అందించడం ఎంతో గొప్ప విషయమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ సుబ్బరాజు హైస్కూల్‌లో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌ను ఆయన ఎంఇఒలు కిరణ్, రామారావులతో కలిసి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని కోరారు.

పుస్తకాల పంపిణీ

నూజివీడు టౌన్ :మండలంలోని గొల్లపల్లిలో ఉన్న శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు జి.శారద ఆధ్వర్యంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ భావిశెట్టి వీరరాఘవయ్య చేతులమీదగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, జల్లు లక్ష్మి, మల్లేశ్వరి, విఠల్ బాబు, కోటేశ్వరమ్మ, పుల్లారావు, మోహన్‌రావు, రంగారావు, కృష్ణవేణి, సౌజన్య, మనోహరం, సాకా రవి, లక్ష్మీకుమారి, నాన్ టీచింగ్ సిబ్బంది వరలక్ష్మి, రంగారావు, నారాయణ పాల్గొన్నారు.

చిన్నారులకు నోట్ పుస్తకాలు, పలకల పంపిణీ

టి.నరసాపురం :సమాజంలో ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని బంజారా భజరంగీ భేరి సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ తెలిపారు. టి.నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో ధరావత్ ప్రవీణ్ నాయక్ జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జరభల చందా నాయక్, ధరావత్ రవి నాయక్, భూక్యా సర్వేశ్వరరావు, లావుడియా నాగేంద్ర, భూక్యా సత్యం, జరభల యుగంధర్ పాల్గొన్నారు.

16న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అంగన్వాడీ వర్కర్ల, హెల్పర్ల పిల్లలకు తల్లికి వందనం, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అందరూ పేద కుటుంబానికి చెందినవారేనని తెలిపారు. వారికి రేషన్ కార్డులు, ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరుతూ 16న జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు విమల, సెక్టార్ నాయకులు శాంతి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి.మునీర్ కోరారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో మడివి కామయ్య అధ్యక్షతన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి.మునీర్ మాట్లాడుతూ అనేక ఏళ్లుగా గిరిజనలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలిచ్చి, విత్తనాలు, ఎరువులు రాయితీపై అందించాలని కోరారు. తల్లికి వందనం పథకంలో భాగంగా అందరి పిల్లలకు రూ.15 వేలు ఇస్తానన్న మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు వెంటనే నగదు చెల్లించాలన్నారు.

పి-4లో పేదలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి నూజివీడు టౌన్

మండలంలోని తుక్కులూరు గ్రామంలోని నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పి-4లో భాగంగా మండవ వెంకటరామయ్య పేద విద్యార్థులకు రూ.40 వేలు, వృద్ధాశ్రమంలో వీల్ చైర్స్ కోసం రూ.30 వేలు అందించారు. పి-4 కో-ఆర్డినేటర్ బి.సుబ్బారావు మాట్లాడుతూ మండవ ఫౌండేషన్ ద్వారా గతంలో అనేక పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు పిలుపుమేరకు మండవ ఫౌండేషన్ ద్వారా మండవ వెంకట రామయ్య, వారి తనయులు ప్రభాకరరావులు ముందుకొచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు చెప్పారు.

విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెంలో ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజులు, పుస్తకాల పేరుతో జరుగుతున్న అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ప్రయివేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ అధికంగా ఉందన్నారు. అది సరిపోక పుస్తకాల పేరుతో అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. దీంతో తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పుస్తకాలు బయట కొంటే సిలబస్ మారిపోతుందంటూ విద్యార్థి తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారన్నారు. వంద రూపాయలకు పుస్తకాన్ని రూ.200, రూ.250లకు విక్రయిస్తున్నారని, అవి సరిపోవంటూ యూనిఫాం పేరుతో మరొక రూ.రెండు వేలు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా మండల విద్యాశాఖాధికారులు పట్టించుకోవడంలేదన్నారు. అటువంటి విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.పవన్, సహాయ కార్యదర్శి బి.మనోజ్, జిల్లా నాయకురాలు జి.రమ్య, కె.అమూల్య, జంగారెడ్డిగూడెం పట్టణ నాయకులు పి.సతీష్, పి.సుందర్రావ్, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపిపి, సభ్యులు

ప్రజాశక్తి- ముదినేపల్లి

ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి, సభ్యులు బహిష్కరించారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం సాయంత్రం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అన్ని శాఖల అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించటం లేదని, గ్రామ సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు కనీస సమాచారం అందించడంలేదన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎంపిటిసిలు మాట్లాడుతూ ఇటీవల ఎంపీ మహేష్ కుమార్ ముదినేపల్లి మండలానికి పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా స్థానిక ఎంపిపికి, జెడ్‌పిటిసి సభ్యురాలికి, స్థానిక సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు సమాచారం ఇవ్వలేదన్నారు. అలాగే అన్ని గ్రామాల ప్రజలకు కనీస సమాచారం లేదని ధ్వజమెత్తారు. మండలంలో ఐదు అప్పర్ ప్రైమరీ పాఠశాలాలు రద్దు చేసిన విషయం కూడా కనీస సమాచారం లేదని ఎంఇఒ నరేష్ కుమార్‌పై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులను ఎవరెవరు ఏ పంచాయితీకి ఇన్‌ఛార్జిగా వేస్తున్నారో కనీస సమాచారం ఇవ్వడంలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు రాకపోవడంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించే సమావేశానికి అధికారులు రాకపోవడం కారణంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం లేకపోవడంతో సమావేశాన్ని సభ్యులంతా బాయ్ కాట్ చేశారు.

ఎఎంసి ఛైర్మన్ పదవి రేసులోకి రజిత

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ పదవి మహిళకు కేటాయించడంతో సూరానేని రజిత ఆ పదవిని ఆశిస్తున్నారు. కీర్తి శేషులు సూరానేని శోభనాద్రిరావు (రాజియ్య) 1984 నుంచి తెలుగుదేశం పార్టీకి విశేష సేవలందించారని పార్టీ నాయకులు, కార్యకర్తలు చెబుతు న్నారు. అనంతరం ఆమె భర్త సూరానేని గోపీనాథ్ పట్టాయ గూడెం పరిసర ప్రాంత ప్రజలందరికీ చేదోడువాదోడుగా ఉంటూ మండలంలో పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కార్యకర్తలు, నాయకులు అంటు న్నారు. సిఎం చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో, నియోజకవర్గ ముఖ్య నాయకు ల ఆదరాభిమానాలతో చింతలపూడి నియోజకవర్గ రైతు సోదరులకు అండగా ఉంటూ, టిడిపి అభివృద్ధికి, బిజెపి, జనసేన కార్యకర్తలకు అండదండలు అందిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు.

రూ.60 లక్షలతో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రానున్న రోజుల్లో పట్టణంలో తాగునీటి సమస్యలు ఉండకూడదని సుమారు రూ.60 లక్షలతో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. తాగునీటి పైపులైన్ల ఏర్పాటు పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఇ ఫణిభూషణ్‌రావు, కౌన్సిలర్లు చిటికెల అచ్యుత రామయ్య, నేట్రు గణేష్ యాదవ్, నాయకులు బత్తిన చిన్న, పెసర కంటి త్రిమూర్తులు, కంచుమర్తి ప్రకాష్, ఎఇ రాజేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పరిస్థితులు మెరుగుపర్చుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతి నెలా రెండో శుక్రవారం జరిగే పట్టణ ఆరోగ్య పారిశుధ్య పౌష్టికాహార సమావేశంలో ప్రజలు పాల్గొని పారిశుధ్య పరిస్థితులు స్థానిక ఆరోగ్య, ఆశా కార్యకర్తకు తెలియజేయాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక తంగెళ్లమూడి పట్టణ ఆరోగ్య కేంద్రం యాదవ్ నగర్-2 సచివాలయంలో శుక్రవారం జరిగిన యుహెచ్ఎస్ఎన్‌సి సమావేశానికి గోవిందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కార్యకర్త విజయ శ్యామల, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, ప్రమీల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

టి.నరసాపురం :ఆక్రమణల నుంచి పంచాయితీ ఆస్తులు కాపాడాలని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామ పంచాయతీలో ఆర్ఎస్ నెంబర్ 369/10లో ఉన్న అసైన్‌మెంట్ ల్యాండ్‌లో ఉన్న 0.50 సెంట్ల స్థలంలో ప్రభుత్వ భవనాలు సచివాలయం-1, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, బల్క్ మిల్క్ సెంటర్, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాల కోసం పంచాయతీ వారు తీర్మానం చేసి, ఆ స్థలంలో సచివాలయం-1,రైతు భరోసా కేంద్రం నిర్మించారని తెలిపారు. డిజిటల్ లైబ్రరీకి పునాదులు తవ్వి బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణానికి జియో ట్యాగ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇవన్నీ పంచాయతీ తీర్మానాల్లో పొందుపరచినట్లు తెలిపారు. ప్రభుత్వ భవనాలకు కేటాయించగా మిగిలిన పంచాయతీ స్థలంలో అక్రమార్కులు అక్రమంగా నిర్మాణాలు నిర్మిస్తుంటే పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ స్థలంలో అక్రమ కట్టడాలు తొలగించి పంచాయతీ స్థలాన్ని అక్రమించిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

చింతలపూడి ఎస్ఐగా సతీష్

ప్రజాశక్తి - చింతలపూడి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చింతలపూడి ఎస్ఐ సతీష్ అన్నారు. చింతలపూడి ఎస్ఐగా ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట ఇతర అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షునిగా నరేష్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎంఆర్‌పిఎస్ ఉంగుటూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉంగుటూరుకు చెందిన మర్రి నరేష్ నియమితులయ్యారు. ఉంగుటూరు బిసి కమ్యూనిటీ హాలులో ఎంఆర్‌పిఎస్ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా ఇన్‌ఛార్జి కూచిపూడి సత్యం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి నరేష్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. అనంతరం జరిగిన సభలో సత్యం మాట్లాడుతూ జులై ఏడో తేదీన ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మురళీకృష్ణ, రాష్ట్ర నాయకులు మాముడూరి ఏలియ, కొత్తపల్లి చంద్రమౌళి, కాటూరి జోగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **అశ్వారావుపేట బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపినస్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కంభంపాటి వెంకట రామారావు, S/o: కంభంపాటి శ్రీరాములు, వయస్సు: 57**సం॥లు, **నివాసం:** మక్కినవారిగూడెం గ్రామం, టి.నరసాపురం మండలం, ఏలూరు జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయిం చుకున్నారు. కావున సదరు వ్యవహార మునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు (సెటిల్‌మెంటు ఆస్తి వివరం): ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్ డి.లోని, టి.నరసాపురం మండలం, మక్కినవారిగూడెం పంచాయితీలోని మక్కినవారిగూడెం గ్రామం తాలూకు - నా స్వార్జితం బాపతు ఆస్తి అయివుండి, అనగా లోగడ ది. 28-7-1982వ తేదీన కాకర్ల వెంకట్రావు గారి వల్ల చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో 1వ పుస్తకం, 402 వాల్యూం, 477ల 479 పుటలలో 1982వ సం.పు ద.నెం. 1760రు గా నా పేర రిజిష్టరీ కాబడిన క్రయదస్తావేజు రీత్యా నాకు సర్వ హక్కులతో సంక్రమించబడి, నేటి వరకూ నా సంపూర్ణ స్వాధీన అనుభవ హక్కు భుక్తములలో గల జిరాయితీ మేరకు నివేశన స్థలం రి.స.నె. 282 రు య.2-99ట్లులో నీకు సెటిల్‌మెంట్ చేసిన చ॥గ॥ 129లు, **డాక్యుమెంట్: 471/2019** గల స్థలమునకు హద్దులు : **తూర్పు:** ఈ రోజున నేను కంభంపాటి సత్యనారాయణకు రిజిష్టరీ చేసిన స్థలం, **దక్షిణం :** కుంకపూడి వెంకట్రావు గారి స్థలం, **పడమర:** సాధు దుర్గారావు గారి స్థలం, **ఉత్తరం** :పంచాయితీ సిమెంటు రోడ్డు

ఇట్లు: గంగ్రెడ దీనదయాళ్, అడ్వకేట్ & నోటరీ,
సత్తుపల్లి, ఖమ్మం జిల్లా, సెల్ : 9848578963

ఐద్వా మండల కమిటీ ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండలాధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక ఏకగ్రీవమైంది. మండల కార్యదర్శిగా మడకం కుమారి, అద్యక్షురాలిగా పంచకర్ల నాగలక్ష్మి ఎన్నికయ్యారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా మండలి మహాసభ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఐద్వా సభ్యురాలు శిరీష అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నూతన మండల కమిటీ కార్యదర్శి అధ్యక్షురాలితో పాటు నూతన కమిటీ సభ్యులుగా మాండ్రు శిరీష, పెట్ల మంగకుమారి మరి కొంతమంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ఈ నెల 30వ తేదీతో ముగియనున్నాయని కళాశాల ప్రిన్సిపల్ కె.సజినీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశాలు మే 19న ప్రారంభమయ్యాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూన్ 30వ తేదీతో గడువు ముగుస్తుందని తెలిపారు.

CHANGE OF NAME

I, **GUDURI JAYA LAKSHMI** W/o Guduri Nageswara Rao, residing at D.No. 3-164, Bokka Gudem, K.P.Palem, Mogaltur Mandal, W.G.Dt. A.P, I have changed my name from **GUDURU JAYA LAKSHMI** (Old name) to **GUDURI JAYA LAKSHMI** (New name) hence forth I am being called **GUDURI JAYA LAKSHMI** W/o Guduri Nageswara Rao for all purposes.

CHANGE OF NAME

I, **GUDURI CHINNA** S/o Guduri Nageswara Rao, residing at D.No. 3-164, Bokka Gudem, K.P.Palem, Mogaltur Mandal, W.G.Dt. A.P, I have changed my name from **GUDURU CHINNA** (Old name) to **GUDURI CHINNA** (New name) hence forth I am being called **GUDURI CHINNA** S/o Guduri Nageswara Rao for all purposes.

CHANGE OF NAME

I, **GUDURI NAGESWARA RAO** S/o Guduri Anjaneyulu, residing at D.No. 3-164, Bokka Gudem, K.P.Palem, Mogaltur Mandal, W.G.Dt. A.P, I have changed my name from **GUDURU NAGESWARA RAO** (Old name) to **GUDURI NAGESWARA RAO** (New name) hence forth I am being called **GUDURI NAGESWARA RAO** S/o Guduri Anjaneyulu for all purposes.

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు నగరం, లక్ష్మీవారపుపేట. మౌలానా అజాద్ ఉర్దూపాఠశాల వద్ద, వాస్తవ్యులు మొహమ్మద్ ఇల్యాస్ - ఉర్ - రెహమాన్ గారి కుమారుడు మొహమ్మద్ ముజీబ్ - ఉర్ - రెహమాన్ అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది.

నా క్లయింట్ తనయొక్క వర్జినల్ దస్తావేజు అనగా ది.11.06.1996వ తేదీన దేవీ రియల్ ఎస్టేట్ గవరవరం వారి వద్ద దుగ్గిరాల గ్రామములోని ఆర్.యస్.నెం:20/3లోని 240 చ.గ స్థలము కొనుగోలు చేసి ఏలూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.3438/1996 ది.13.06.1996గా రిజిష్టర్ కాబడిన వర్జినల్ డాక్యుమెంట్‌ను ది.10.06.2025వ తేదీన అతని బంధువు అయిన మహమ్మద్ షాకీర్‌కు ఇచ్చి జిరాక్సు కాపీలను తీయించుకురమ్మని చెప్పగా అతను దస్తావేజులను చేతి సంచిలో పెట్టుకుని తన యొక్క యాక్టివా స్కూటర్‌పై 12 పంపుల సెంటర్ కనకదుర్గమ్మ గుడి వద్ద గల జిరాక్సు షాపు వద్దకు వెళ్ళియున్నారనియున్నూ, షాపు వద్దకు వెళ్ళిచూడగా స్కూటర్‌కు తగిలించిన దస్తావేజులు గల చేతిసంచి కనబడలేదనియున్నూ, వెంటనే వచ్చిన దారిలో వెనకకు వెళ్ళి వెతగగా ఎక్కడా కనిపించలేదనియున్నూ తెలియపర్చినారు. సదరు దస్తావేజు కలిగిన సంచి ఎవరికైన దొరికిన యెడల నా ఈ క్రింది అడ్రస్‌కు తెలియపర్చవలసినదిగా కోరుచున్నాను.

ఆచంట వెంకటేశ్వరరావు
అడ్వకేట్, మాగంటి వారి వీధి,
ఆర్.ఆర్.పేట, ఏలూరు-2.
సెల్:94401 86699

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ ఏలూరు నగరం, లక్ష్మీవారపుపేట. మౌలానా అజాద్ ఉర్దూపాఠశాల వద్ద, వాస్తవ్యులు మొహమ్మద్ ఇల్యాస్ - ఉర్ - రెహమాన్ గారి కుమారుడు మొహమ్మద్ హసీబ్ - ఉర్ - రెహమాన్ అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది.

నా క్లయింట్ తనయొక్క వర్జినల్ దస్తావేజులు అనగా 1.ది.11.06.1996వ తేదీన దేవీ రియల్ ఎస్టేట్ గవరవరం వారి వద్ద దుగ్గిరాల గ్రామములోని ఆర్.యస్.నెం:20/3లోని 240 చ.గ స్థలము కొనుగోలు చేసి ఏలూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.3439/1996 ది.13.06.1996గా రిజిస్టర్ కాబడిన వర్జినల్ డాక్యుమెంట్ మరియు 2.ది.05.12.1996వ తేదీన శ్రీ శ్రీనివాస రియల్ ఎస్టేట్ & కన్‌స్ట్రక్షన్స్ ఏలూరు వారి వద్ద నుండి కొనుగోలు చేసి ఏలూరు రిజిస్టర్ వారి ఆఫీసులో నమోదు కాబడిన డాక్యుమెంట్ నెం.7198/1996, సోమవారప్పాడు గ్రామంలోని ఆర్.యస్.నెం.80/1లోని చ.గ.200లు స్థలము యొక్క వర్జినల్ దస్తావేజులను ది.10.06.2025వ తేదీన అతని బంధువు అయిన మహమ్మద్ షాకీర్‌కు ఇచ్చి జిరాక్సు కాపీలను తీయించుకు రమ్మని చెప్పగా అతను దస్తావేజులను చేతి సంచిలో పెట్టుకుని తన యొక్క యాక్టివా స్కూటర్‌పై 12 పంపుల సెంటర్ కనకదుర్గమ్మ గుడివద్దగల జిరాక్సు షాపు వద్దకు వెళ్ళియున్నారనియున్నూ, షాపువద్దకు వెళ్ళిచూడగా స్కూటర్‌కు తగిలించిన దస్తావేజులు గల చేతిసంచి కనబడలేదనియున్నూ వెంటనే వచ్చిన దారిలో వెనుకకు వెళ్ళి వెతగగా ఎక్కడా కనిపించలేదనియున్నూ తెలియపర్చినారు. సదరు దస్తావేజు కలిగిన సంచి ఎవరికైన దొరికిన యెడల నా ఈ క్రింది అడ్రస్‌కు తెలియపర్చవలసినదిగా కోరుచున్నాను.

ఆచంట వెంకటేశ్వరరావు
అడ్వకేట్, మాగంటి వారి వీధి,
ఆర్.ఆర్.పేట, ఏలూరు-2.
సెల్:94401 86699